# అమృతహస్తం

"నన్ను ఏప్రిల్ ఫూల్ చెయ్యటం లేదుకదా?"

ఫోనులోనే ప్రశ్నించాను, నా మిత్రుడు మూర్తిని.

"నేనూ నమ్మలేదు. నా మిత్రుడు నొక్కి చెప్తున్నాడు."

"అయితే ఆ దేశం తప్పకవెళ్ళాలి."

ఈ మిత్రుడు ఫోన్లో చెప్పినవిషయం ఆలోచనలను రేపి చివరకు అనుకున్నా- "నిజంగా నన్ను ఏప్రిల్ ఫూల్ చేశాడు. కాకపోతే హస్తం దేశంమీద మబ్బులనీడలా, ఆకాసంలో యింద్రధనుస్సులా, మంచుకురిసిన రాత్రి చందమామకు అడ్డుగా బొమ్మలా కనబడట మేమిటి? అది కనపడిన దగ్గిరనుంచీ ఆ దేశంలో అమృతమే వూరుతోందట! అందుకే ఆ హస్తాన్ని అమృత హస్తమని ప్రజలు విరగపడి చూడటమేకాదు- ఓ దేవుని అవతారం ప్రత్యక్షమైనట్లు కొలుస్తున్నారట."

ఈ నవీనయుగంలో పూర్తిగా భౌతిక దృష్టితోనే బ్రతకగలిగే రోజులో ఈ ఛాందసం పూర్తిగా నాలో చావలేదే అని విచారించాను. నౌకరు అమర్చిన తిండి రుచిగా ఉంది. వీడికి మలయాళీల "కూటు" దగ్గిరనుంచి పంజాబీల "తందూరి చికెన్" వరకేకాక యింగ్లీషు వంటలు కూడా వచ్చు. నా డైనింగ్ టేబిల్ మీదనున్న ఏపిల్ పళ్ళు కాశ్మీరు నుంచి, కేరట్ వూటీనుంచి, ఖర్జూరం ఆఫ్రికానుంచి, తింటున్న గాజు ప్లేటు జపాన్ నుంచి వచ్చాయ్. ఎదరుగానున్న చపాతి గోధుమ అమెరికాలో యే మారుమూల కుగ్రామంలో పండిందో! భోజనం అయ్యాక ఇంగ్లండ్‌లో తయారయిన బట్టతో కుట్టించిన లౌంజ్ (Lounge) సూటువేసుకుని, కలకత్తాలో తయారైన అంబాసిడర్ షూ, బొంబాయిలో వెలసిన క్రీమ్ బెంగళూరు టై... బెల్జియం నిలువుటద్దంలో సరిగా చూసుకుని... నా నాలుగో అంతస్తు మకాం నించి లిఫ్ట్‌లో దిగి. ఇటలీలో వుద్భవించిన ఫియట్ కారు స్టీరింగ్ పట్టుకున్నాను. నేను సుఖంగా బ్రతకడానికి ప్రపంచమంతా సహాయపడ్తోంది.

హాలెండ్ ఫిలిప్సుమార్కు మెర్క్యురీలైట్ల వెలుగులో ప్రయాణం చేసి అయిదుమైళ్ళ దూరంలోవున్న థియేటర్ చేరుకున్నాను. ఆ రాత్రి రష్యాలోని ఉజబెకిస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు నాట్యప్రదర్శన లిస్తున్నారు. రెండు వేలకు పైగానున్న ప్రేక్షకులను తమ అందమైన అవయవాల కదలికతో సంగీతం సృష్టించి మంత్ర ముగ్ధులను

చేశారు. థియేటర్ అలంకరణే కాదు- చూడటానికి వచ్చినవాళ్ళ అపురూపమైన అందాలు శరీరాలను పులకింపచేశాయ్. ఈ పెద్ద ప్రపంచం మా వూరంత చిన్నదైపోయిందీనాడు.

థియేటర్ దగ్గర మూర్తిని కలిశాను. అతని భార్య ప్రభాత్ పంజాబీ వనిత. మనిషి బంగారు బొమ్మయినా చిక్కితే రక్తం వస్తుంది. ఇద్దరు పిల్లలు. మూర్తి సైంటిస్టు. ఎప్పుడూ ఆలోచిస్తున్న మనిషిలా వుంటాడు. ఒంటిమీద అంత శ్రద్ధ కనిపించదు. రెండు నెలలకైనా ఒకసారి జుత్తు సెలూన్‌లో అప్పజెప్తాడో లేదో! తరచూ భార్యాభర్తలు జగడమాడటం కద్దు. పెద్ద విషయాలు కావు. చిన్నవే. సర్దుకుపోవచ్చు. కానీ ఇద్దరూ చెరోవేపు పరుగెత్తుకు పోయేవాళ్ళు కాబట్టి ఈ సంసారపు బండికి రెండువేపులా యిద్దరిని కట్టి లాగించటం జరగడంలేదు.

మూర్తి ఆధునిక జీవితం యిచ్చే అందాన్ని ఈ మధ్యనే బాగా ఆస్వాదించటం మానలేదు. ఒకసారి అతని కారు స్టీరింగు వాళ్ళ ఆఫీసు అమ్మాయి పట్టుకోగా అతను పక్కనేకూర్చోటం చూశాను. మొదట ఖరీదైన సరుకు కొద్దిగా తాగినవాడు యిప్పుడు చవకదైనా హెచ్చు తాగుతున్నట్లు విన్నాను. సిగరెట్ నోటిలో లేనిదే యే ఆలోచనా రాదు.

ప్రభాత్ యెప్పటిలా నన్ను కేళీ చేసింది. పెళ్ళికి తొందరేం వచ్చిందన్నాను. మూర్తి మళ్ళీ అమృతహస్తం గురించి యెత్తి, ఆ దేశానికి పోదాం అన్నాడు.

"నీ వూహలో అలాంటి దేశాన్ని సృష్టించుకున్నావ్- అంతే."

"కాదు, నిజంగా వుందట. అక్కడ అందం అమృతంలా వూరుతోందట."

"ఇక్కడ మాత్రం అందంలేదా? చూసే కళ్ళు లేకపోతే యెక్కడా అందంలేదు."

ఒకసారి నిదానంగా నావేపుచూసి అందాన్ని నిర్వచించాడు. అతని నిర్వచనం అతనిభార్యకు వినిపించేటట్లే చెప్పాడు. ప్రభాత్ వినిపించుకోనట్లే వూరుకుంది. మనిషి అదేదోలా వున్నాడు. ఆ మాటల్లోనూ కనిపించని బాధ, వెకిలితనం, వెఱ్ఱితనం కూడా వున్నాయ్.

నేను తిరిగి వెళ్ళిపోతూ మూర్తి నిర్వచనాన్ని నెమరువేసుకున్నాను. అతను జీవితంలో యేదో వెతుక్కుంటున్నాడు. ఏదోకాదు- అందాన్ని. ఆ నాట్యకత్తెలు రంగురంగు పూలుగా కదిలి ఒక మాలగా మారి నా మెడలో పడ్డట్టు భ్రమ చెందసాగాను. ఆ సంగీతం నా హృదయ స్పందనలో రాగమై, ఉత్తేజమైన వూహలు నాలో నాట్యభంగిమలలా ఒకేరీతితో మసలే అవకాశాన్నిస్తున్నాయి.

మరుసటిరోజు మామూలుగా మిల్లుకు వెళ్లాను. ఒక చివర ప్రత్తి అందిస్తే యింకో చివర గుడ్డ ఉత్పత్తి అవుతోంది. ఆ గుడ్డలో అందాలు వొలికించే అద్దకాల చీరలూ, బ్లీచ్ చేసిన తెల్లని బట్ట. రంగుల కలకయితో ఆడవాళ్ళ బిగువైన అందాలకు అశలను జోడుచేసే జాకెట్ బట్టలు- ఒకటేమిటి? మిల్లులే ఒక ఎగ్జిక్యూటివ్‌గా నేను సృష్టించిన అందం దేశదేశాలకూ పంచిపెట్టున్నాను. మనిషి మెదడు ఒకసారి ఆలోచించి సృష్టించిన మెషిను కలకాలం అతనికి పాదాలను వొత్తుతోంది. మరమగ్గాలు మనుషుల సహాయం అట్టే లేకుండానే బట్టను కొల్లలుగా ఉత్పత్తి చేస్తున్నాయి.

చీకటిపడ్డాక తిరిగి తిరిగి యింటికి వచ్చాను. పోర్టికోలో ఈజీ చైర్ మీద కూర్చున్నాను. టేబిల్ లాంప్ వెలుతురులో ఒకసారి పేపరు తిరగవేసి ప్రపంచం మారుమూలలలో తిరిగాను. ట్రాన్సిస్టరు కమ్మని సంగీతం తరువాత వార్తలను అందజేసింది. భూమి పచ్చదనానికి చంద్రుడు అసూయ పడ్డట్లున్నాడు, ఒంటికన్నుతో సగం కన్నువిప్పి చూస్తున్నాడు. దూర దూరాన వున్న చుక్కలు రెప్పలాడిస్తూ చూస్తున్నాయ్. అక్కడక్కడా తెగిన తెల్ల మేఘాలు పరుగెత్తుతూ భూమిమీద వాలడానికి పయనిస్తూ ఒక కొండమీది బండరాళ్ళకు ఢీకొని ముక్క చెక్కలయ్యాయ్.

పైనించి పోయే విమానం, రాత్రి చూసిన రంగుపూల తలపు, టేబిల్ మీద రుచైన ఆహారం. ఈ అందమైన మేడ. ప్రకృతి... ఇవన్నీ ఎందుకో నాకు తలనొప్పిని కలిగించాయ్. ఒక మాత్ర వేసేసరికి తలనొప్పి తగ్గింది. కానీ మనసులోని నొప్పి తగ్గలేదు. తలలో ఖాళీగా వుంది. బాధ, అవమానం నా నరాలన్నిటినీ పీకి వేస్తున్నాయ్. నా కాళ్ళపై నిల్చోనట్లు, నేనో కోసివేసిన మాంసం ముద్దగా కూలిపోయినట్లు, నా మెదడో తేనె పట్టయితే... చీమల పుట్టయినా బాగుండేదేమో?

మిల్లు నుంచి వచ్చాక ఆ ప్రదేశాన్ని మరువ లేకపోతున్నాను. ఈ లోకంలో పరుగెత్తితే సరిపోదు - పరుగులో గెలవాలి. గెలవడానికి ఎంత తరిఫీదు అవసరం? పోటీల మయమైన ప్రపంచంలో పోటీలో వోటమి వహించరానిది అవుతుంది. నేను ఉత్పత్తి చేసే గుడ్డల్లో పోటీ... మనిషికి కడుపొక్కటే సమస్యకాదు. మనిషి సమస్యల సాలెగూడులో చిక్కుకుంటున్నాడు. ఈ నాగరిక ప్రపంచంలో భద్రత, ఆరోగ్య సాధనాలూ, అందం వున్నా వాటిని కూడా అనుమానంతో తాగేస్తున్నాడు మనిషి.

ఈ పుష్కలంగా వున్న ప్రదేశంలో ఎంత దారిద్ర్యం వుంది! రోడ్డు వార గతిలేక చింకిగుడ్డలు కప్పుకున్నవాళ్ళ నెందర్ని చూశాను. తిండి గుడ్డా లేక తికమకపడి తియ్యని ప్రాణాలను యెందరీ లోకంలో చేతులారా పీకి పారేటం లేదూ? పందులుకూడా మసలటానికి సంకోచించే మురికి గుంటల్లో ఎన్ని మానవ జీవాలు నికృష్టంగా బ్రతకటంలేదు?

నా రూపుతో నాలాంటి ఆశలతోనున్న ఈ మనుషుల కోసం నేనేం చేశాను? తోటివాళ్ళ కనీసపు కోర్కెలు తీర్చలేని నాకు, తోటివాళ్ళమధ్య అన్ని కోర్కెలూ పొందటానికి అర్హత ఏ న్యాయశాస్త్రం యిచ్చింది? నాకు ప్రాణం వుంటే తోటి ప్రాణులపై జాలి పుట్టేదేమో? నేనో యంత్రాన్ని. నా చుట్టూ వున్న ఆక్రందనలను వినకుండా హాయిగా దర్జాగా బ్రతుకుతున్నాను.

మూర్తి చెప్పిన అందం నిర్వచనం జ్ఞప్తికి వచ్చింది. ఆ నిర్వచనం నాపై వర్తింపజేస్తే నేనొక కురూపిని! నాలాంటి కురూపులు తప్పక మూర్తి చెప్పిన దేశం వెళ్లి ఆ అమృతహస్తాన్ని దర్శిస్తే మా మనస్సు, మాట, చేతల్లో అమృతం వర్షిస్తుందేమో?

ఉదయమే మూర్తికి ఫోను చేశాను. ఇంకా లేవలేదన్నారు. మరో అరగంట పోయాక మళ్ళీ చేశాను. ఇంకా లేవలేదు. "లేపండి!" అన్నాను. "అర్జంటా?" అంది ప్రభాత్. అవునన్నాను. ఓ అయిదు నిమిషాల వరకూ ఏదో కోలాహలం వినిపిస్తోందిగాని మూర్తి ఫోను దగ్గరకు రాలేదు. చివరకు ప్రభాత్ ఏడుపు స్వరంతో-

"రావ్! వెంటనే రా... నాకు భయమేస్తోంది" అంది.

"ఏం?"

"మూర్తి... మూర్తి... కళ్ళు తేలవేస్తున్నారు..."

"వస్తున్నా."

లిఫ్టు కరెంటులేక పని చెయ్యటంలేదు. మెట్లు దిగాను. కారు త్రోవలో అల్లరి పెట్టింది. మూర్తి ఇంటికి వెళ్ళేసరికి అతను చచ్చిపడి వున్నాడు.

రాత్రి చాలా సేపటివరకూ నిద్దరపోలేదట. భార్యాభర్తలు ఏదో వాదించుకున్నారట. దగ్గుతున్నాడు. మందు వేసుకుంటున్నానన్నాడు. స్లీపింగ్‌పిల్స్ సీసా తలగడ కింద వుంది.

మూర్తిని బుగ్గి చేసి యింటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిదైంది. ఆమె తల్లిదండ్రులు జలంధర్‌లో వున్నారు. మూర్తికి తండ్రి వొక్కడే వున్నాడు. ఈ పెళ్ళితో దూరమయ్యాడు. పొరుగువారిని కాస్త చూస్తుండమని చెప్పి వచ్చాను.

ఆ రాత్రి నాకు నిద్దర పట్టడంలేదు. మూర్తి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో అంతుచిక్కలేదు. ఎక్కడో వొక చిన్న చీటీ అయినా రాసి చావలేదు. బహుశః వొక బొందెలో పది రకాల జీవితాలను గడపడానికి ప్రయత్నించి, ఆ బరువు మోయలేక కూలిపోయాడేమో? లేక మనవాళ్ళతో అతి చనువుగా మాట్లాడే ప్రభాత్ శీలాన్ని అనుమానించాడా? ఏమో?

రాత్రి పన్నెండు దాటిపోయింది. నిద్రపోడానికి ప్రయత్నించినా మూర్తి ప్రాణం యింకా నా చుట్టూ తిరుగుతున్నట్లే వుంది. ఆ బొందె బుగ్గయి సమసిపోయినా, బుగ్గికాలేని కొన్ని సమస్యలను వ్యూహాలను వదిలి వెళ్ళాడు. అతను సైంటిస్టుగా కొన్ని పనులను చేసి చూపించాడు. అతను లేకపోయినా అతని పేరులో అవి బ్రతికే వున్నాయ్. నిద్దరపోడానికి ప్రయత్నించసాగాను.

చప్పున ఎవరో తలుపు తట్టారు.

"ఎవరు?"

"మూర్తి!"

"నువ్వు చచ్చావుకదూ... తలుపు తియ్యను."

"నేను రాలేననుకున్నావా? నేను సైన్‌టిస్టును. ఇదిగో టార్చి వేశాను. హో... హో... తలుపు అదే తెరుచుకుంది."

చూసేసరికి మూర్తి ఒక మర మనిషిలా వున్నాడు. ఒక్కొక్క అడుగువేసి నా వేపు వస్తున్నాడు. తలమీద వొక డొక్కులా వుంది. అందులోనించి బొగ్గుతో నడిచే రైలింజను గొట్టంనించి పొగ వచ్చినట్లు పొగ వస్తోంది. పాదాల వెనుక వేపు విమానం జెట్‌లా నడుస్తుంటే తెల్లనిపొగ, తోరణాల్లా కదులుతున్నది.

"ఎందుకొచ్చావ్ మూర్తీ?"

"నా పెళ్ళాన్ని ప్రేమించావ్ కదూ?"

"ఎవరన్నారు?"

"హో... హో... హో... నీకు ప్రేమలేఖ వ్రాసింది... పోస్టు చేయలేదు." నాకు ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. ఆవేశంతో పరుగెత్తుకు వెళ్ళి చెయ్యెత్తాను.

"చెంపమీద తాకకు, ఆటంబాంబు స్విచ్ అక్కడ వుంది."

ఆ మాటలు ఆవేశంలో హాస్యంగా తోచాయ్. తీసి లెంప వాయించగానే పెద్ద ప్రేలుడు శబ్దం వినిపించింది. ఆ ఆకారమంతా పిండిపిండై మాయమై, ఆ పొగలో పెద్ద హస్తం కనిపించింది. ఈ హస్తానికి మాంసంగాని, చర్మంగాని లేదు. భయంకరమైన ఎముకల వేళ్లు కదులుతున్నాయ్. ఆ భస్మాసురహస్తం నావేపే కదలగానే కెవ్వున కేకవేశాను. నా వంటపుట్టే ప్రక్క గదిలోనించి పరుగెత్తుకొచ్చాడు. తెలివి తెచ్చుకున్నాక మరి నిద్దరపోలేదు.

ఉదయమే ప్రభాత్ దగ్గరకు వెళ్ళాను. నన్ను చూసి ఆమె ప్రేమించి పెళ్లి చేసుకున్న మొగుడు యేం వుంచిపోయాడు, యేమిచ్చి పోయాడని ఏడ్చింది. మిల్లులో కార్మికులను తొందరగా వొక పనిని చెయ్యమంటే – మాకేం హెచ్చు వస్తుందా? అని చెయ్యలేదు. మేం హెచ్చు ఉత్పత్తిచేస్తే మాకేం లాభం వుంది? శ్రమపడి హెచ్చుపండిస్తే గవర్నమెంటు ఇచ్చిన ధర గిట్టుబాటు కాదు. మా కోర్కెలు మీ దృష్టిలో గొంతెమ్మ కోర్కెలు తీర్చేదాకా వీధులు వూడ్చం. ఆసుపత్రిలో చావుబ్రతుకుల మధ్యనున్న వాళ్ళకు మందునీరైనా పోయం. బస్సులు, టాక్సీలు నడపం. ఈ ఆహారం సకాలంలో చేరక కొన్ని వందలమంది చావనీయండి. కానీ మేం గోధుమలు ఓడలనించి దించం. హెచ్చు పనిచేస్తే హెచ్చు జీతం యిస్తారా? నాకు అధికారం ఇచ్చినా నన్ను నమ్మని ప్రజలకోసం ఎందుకు పాటుపడాలి? నాకేం వస్తుందని? నాకేం లాభం?

ఇలా రోజులతరబడి ప్రశ్నించే కోట్లాది చేతులు. రక్తమాంసాలపై చర్మంతో అందంగా మెరిసిపోతున్నా నా కంటికి భస్మాసుర హస్తాల్లా ప్రత్యక్షమై భయంతో మనశ్శాంతిలేక చిక్కిపోయాను.

చివరకు మూర్తి చెప్పిన దేశం వెళ్లడానికే నిశ్చయించాను. ఓరోజు ఉదయమే విమానం ఎక్కేశాను. నేను ఆ దేశం చేరుకునేసరికి సాయంత్రమైంది. విమానం ఆగంగానే స్వాగత వచనాలు వినబడ్డాయ్. మాకోసం చేతిలో పూలదండ పట్టుకొని యౌవనంతో మెరిసిపోతున్న అమ్మాయిలు నిల్చున్నారు. దిగే ఒక్కొక్కరికి ఒక దండ అందిస్తూ. అలా అందిచ్చిన అమ్మాయి అతనిని తోడ్కొని వెడుతోంది. నా చేతిలోని పూలదండలోని గులాబీలు సుకుమార్యం, మల్లెల మందహాసం, నా వెంట వచ్చిన అమ్మాయిలో నిత్యంగా వెలిగిపోతున్నాయ్. అందమైన ఆమె ఆకృతికి వయసు వంపులను సరిదిద్ది, వయ్యారాన్ని సృష్టించి, వలపులను పండించే వసంతాన్ని వెన్నెల్లో మనోహరంగా ప్రకాశింపజేస్తోంది.

"మీ పేరు?"

"ఉషాకన్య."

ఆమె లేత నీలిరంగు నేతచీర తెల తెల్లని బ్లౌజుతో ఉషస్సులాగే వెలిగిపోతోంది. ఆమెకళ్ళు ఉషస్సులో ఆకాశంలో ఇంకా మిణుమిణుకుమనే జంట నక్షత్రాల్లా మెరుస్తున్నాయ్.

నన్ను కార్లో కూర్చోబెట్టి తనే డ్రైవ్ చేస్తోంది. కస్టమ్స్ బాధలేదు. ఇక్కడ అడ్డుగోడలూ, అడ్డదారులూ, ముళ్ళకంచెలూ, ముష్టి యుద్ధాలూ, అనుమానాలూ, ఆవేశాలూ, అట్టహాసం కనపడలేదు.

"ఇంత పెద్ద పట్టణం. ఇక్కడ పోలీసులు అగపడలేదు!"
"పరీక్షగా చూస్తే కనిపిస్తారు."
కాస్సేపు రెప్ప వెయ్యకుండా చూశాను. "ఎక్కడ?"
"ప్రతి మనిషిలోనూ వున్నారు."
ఈ అమ్మాయి అందమైనదే కాదు – తెలివైన దనిపించింది. నన్ను వొక విశాలమైన హోటల్లో రెండో అంతస్తు గదిలోనికి తీసుకు వచ్చింది. నన్ను విడిచి రాత్రయినా కదలలేదు. అన్నీ స్వయంగా అమర్చింది. ఆ చేతుల్లో అమృతం వూరుతున్నట్లుంది.

ఆమె స్వయంగా వడ్డించిన వంటకాలు ఆమె అప్యాయంతో మరింత రుచికరంగా ఉన్నాయ్.

"ప్రయాణ బడలికలో వున్నారు. వేగిరం నిద్దరపోండి" అంది.

ఈమెను కళ్ళారా చూడాలన్న నా భ్రాంతి కంటి రెప్పలు బరువెక్కకుండా చేస్తోంది. ఆమె రెండో మంచంపై పరుపు సర్దుకుని నిద్దరపోడానికి ప్రయత్నిస్తూంటే నా మనసులో పూలదండలతోపాటు ప్రేమకవిత్వం వుద్భవించి కూనిరాగంగా బయటికి వచ్చింది. నా రాగం కంటే ఆమె రాగమయత్వం నన్ను ఒడలు మరిపింపజేస్తోంది. తడబడుతూ "మీరు యిక్కడే నిద్దరపోతారా?" అన్నాను.

"పరుపుమీద వ్రాలుతూ హాఁ..." అంది.
"మీ తల్లిదండ్రులు మిమ్మల్ని కోప్పడరా?"
"దేనికి?"
"ఒకరాత్రి ఒక బ్రహ్మచారివున్న హోటలు రూములో మీరు ఒంటరిగా..."
"నేను ఒంటరిగా వున్నానని ఎవరన్నారు?"
"నే నంటున్నాను. మీవాళ్ళెవరూ లేరుగా!"
"నేను ఒంటరిగాలేను. నా అంతరాత్మ తోడుంది."
"మీ అంతరాత్మ మిమ్ములను ప్రేమించ నిస్తుందా?"
"ఎందుకు ప్రేమించనివ్వదూ?"
"మీరు ప్రేమించినట్లు కనపడలేదు గదా?"
"ప్రేమ నటనతోనే ఉందంటే... నేను మిమ్ములను ప్రేమించడం లేదు."
"మీరు నిజంగా నన్ను ప్రేమిస్తున్నారా?"

ఆమె మంచంమీద చిరునగవుతో లేచి కూర్చుంది. చీరకొంగైనా పక్కకు జారలేదు. పాదాలైనా సరిగ్గా కనపడలేదు. ఆమె చిరునగవుతోనే –

"మిమ్మల్ని ప్రేమించడానికి నే నింకేం చెయ్యాలి?" అంది.
"అది నేనే వివరించాలా?"
"నేను మిమ్మల్ని ప్రేమించాను కాబట్టి మీ విషయంలో జాగ్రత్త తీసుకుంటున్నాను."

ఆమె అప్పటికీ నా కళ్ళవేపు నిదానించి చూడలేదు. నా అందమైన ముఖం వైపు పరీక్షగా చూసి చిన్న చిరునగవు వొలకబొయ్యలేదు. వీచేగాలి, సువాసన, చల్లదనం, కురిసే వెన్నెలా, మెరిసే మెరుపులూ, రాలే చినుకులూ మొదలైన ప్రకృతి ప్రేమ చేష్టలులా ప్రేమతో నిండిన మనుషులూ అలాంటి అందమైన చేష్టలేవో

చేస్తూంటారు. ఆమె అలా చెయ్యగలిగినా చేస్తే చులకనైపోతానని కాస్త బెట్టుసరి చూపిస్తోందని –

"ప్రేమ దేనికి? డబ్బు కోసమే కదా! ఇదంతానూ?" అన్నాను.

ఆమె నవ్వింది, "బాగా చెప్పారు. డబ్బు కోసం?" ఒక్కసారి నావేపు కాస్త నిదానంగా చూసి–

"ప్రేమకూ, డబ్బుకూ బద్ధ వైరం. ప్రేమకూ చంచలమైన మనస్సుకూ కూడా సంబంధంలేదు. నిత్యం నమ్మకంగా మారకుండా మనిషికి సేవ చేసే హృదయంతోనే ప్రేమకు విడివడని సంబంధం. హృదయం విప్పి నా ప్రేమను అర్థం చేసుకోండి," అంది.

ఆమె మళ్ళీ మంచం మీద చారబడింది. కాస్సేపటికి ఆమె నిద్దరపోయింది. గదిలో నీలి బెడ్‌లైట్ వెలుగుతోంది. నేను పోర్టికోలో నిల్చుని సిగరెట్ మీద సిగరెట్ ముట్టిస్తున్నాను. బయట కాస్త చల్లగా ఉంది. ఎవరో భామ చక్కని వేళ్ళతో గిలిగింతలు పెడ్తున్నట్లుంది వాతావరణం. సముద్ర గర్భంనుంచి వచ్చిన చందమామ అప్పుడే కొండలనూ, అడవులనూ దాటుకుని ఒక్కచూపు చూశాడు. ఆమె ముఖం మీద పడిన వెలుగు మెరసి మురిసి వెలిగింది. ఆ ముద్దులొలికే ముగ్ధమోముపై ఏదో హస్తం పడ్డట్లు భ్రాంతి చెందాను. చందమామపై అమృతహస్తం పడిందేమోనని అటు తిరిగాను. ఒక చక్కని చుక్క చందమామకు దగ్గరకున్నట్లున్నా దానిని చేరడానికి ఎన్ని లక్షల కాంతి సంవత్సరాలు పడ్తాయో? తీరా చేరాక అది ఎన్ని కోట్ల సూర్యులకు సరిసమానమైన మంటల్తో మండుతుంటుందో?

ప్రశాంతంగా నిద్దరపోతున్న ఉషాకన్య నాకు దగ్గరగా వున్నట్లే కనిపిస్తోంది.. కానీ నాకూ, ఆమెకూ దూరం ఎన్ని యోజనాలో? తీరా ఆమెను చేరాక ఆమె హృదయం నా గుండెకంటె ఎన్ని వేల రెట్లు ప్రకాశవంతమైనదో? హృదయాలన్నీ ఒకేలా కనిపించవచ్చు. కానీ వాటిలో మనుషులు నింపుకున్న ప్రేమ వెలుగుల తేడాలవలనే ఆ మనుషులను విభజించవచ్చు.

ఆమె దగ్గరగా వచ్చాను. ఆ ముఖాన్ని చూశాను. తెల్లని దుప్పటి కప్పిన అవయవాల అందాన్ని ఊహించి అచ్చెరువొందాను. నా హృదయం రక్తాన్ని పంపుచేయకుండా ప్రేమను పంపుచేసినట్లుంది. ప్రేమతో వుబ్బి హృదయంలో నొప్పికి కారణం ఆ అందం మౌనంగా విసిరిన పూల బాణమేనని... ఆమెను ముట్టుకోడానికి మర్యాదకు మన్నించి... ఇటూ అటూ వెఱ్ఱివానిలా తిరుగుతుంటే... ప్రేమతో శరీరం చీల్చుకుపోతుంటే...

ఆమె నా నిశ్వాసాలు చేసిన శబ్దానికే లేచిపోయి "మీరింకా నిద్దరపోలేదా?" అంది.

నా నోట మాటరాలేదు.

"క్షమించండి... మిమ్మల్ని నిద్దరపుచ్చాక నేను నిద్దరపోవలసింది."

"నేను నిద్దరపోలేదు."

"ఎంచేత?"

"నేను ఒంటరిగా లేను."

"మనిషి ఒంటరిగా వుంటే పడుకోలేడు. జంతువులు వొంటరిగా వుంటవి. అందుకే అవి మగత నిదరపోతాయ్. మనిషి ఎప్పుడు ఒంటరివాడు కాడు. వాటిలో ఒకడు పశువు రెండో వాడు ఆ పశువును అదుపులో పెట్టినవాడు వుంటారు. ఆ అదుపులో పెట్టేవాడు ఎవరిలో సరిగ్గా పనిచేస్తున్నాడో వాణ్ణే మనిషంటాం కదూ? ఒక నాగరికత గల దేశం నుంచి వచ్చిన మీలో ఒకడు అదుపులో పెడ్తున్నవాడుండగా... మీరు ఒంటరిగా ఎలా వున్నారు? నిద్దరపొండి."

అంటూ ఆమె నా పరుపు ఇంకోసారి సర్ది నన్ను ఆహ్వానించింది. ఆమె నా ప్రక్కనే కూర్చుంటుందనుకున్నాను. నేను మంచం మీద పడగానే పోర్టికోలో నిల్చుని తియ్యగా మెల్లగా ఒక జోలపాట పాడింది. ఆమె పోర్టికోలో వెనుక వెన్నెల్లో వెలిగే ప్రకృతి ముందు ఎత్తుగా నిల్చున్న ప్రకృతిమాతలా వుంది. నేను లోతుగా నున్న ఈ గదిలో మంచం మీద చిన్న పిల్లవానిగా వున్నాను. ఆ జోలపాటతో నాలో దాగుండిపోయిన చిన్ననాటి చిలిపి మనసు బయటకు వచ్చి చింతనంతా మరపించి నిద్దరపోనిచ్చింది.

నేను లేచేసరికి ఆమె చీర మార్చి ఎక్కడికో ప్రయాణానికి సిద్ధమౌతోంది. పరుపు మీదనించే "ఎక్కడికి?" అన్నాను.

"మీలాంటి అతిథులు వస్తూంటారుగా!"

నేను లేచాను. పర్సులోంచి డబ్బుతీసి "మీ సేవకు ప్రతిఫలం" అని మంచం మీద వంద రూపాయల కాగితం పెట్టాను. ఆమె డబ్బువేపు నావేపు ఒకసారి చూసి సవినయంగా "మీరు మా అతిథులు. మీ దగ్గర డబ్బు పుచ్చుకుంటే మా ఆతిథ్యం వ్యాపారమౌతుంది. వ్యాపారం కామలోభాలతో హృదయాన్ని కప్పుతుంది. వ్యాపారానికి ఒక గమ్యం లేదు. మనిషికి మాత్రం ఉంది. మనుష్యులంతా ఒక గమ్యం చేరడానికి ఆడే ఆటగాళ్ళు. కొందరు ఫౌల్ గెమ్ ఆడతారు. ఎంపైర్ విజిల్ వున్నదని ఆ క్షణంలో మరచిపోతారు. ఆ విజిల్ మీలోను వుంది, నాలోను వుంది. వస్తాను."

ఆమె డబ్బు తీసుకోకుండా వెళ్ళిపోయింది. పోర్టికోలోనికి వెళ్ళి దిగువకు చూశాను. కారులోనికి అడుగుపెడ్తూ మీదకు చూసింది. నవ్వుతూ నమస్కరించింది. నేను ప్రతి నమస్కారం చేశాను. ఆమె చేతిలో ఏదో నీడ కనపడినట్లు... రాను రాను అది పెద్ద నీడ అయినట్లు... ఆతృతగా ఆమె వెళ్ళిపోతుంటే చూశాను... కారు మీద అమృతహస్తం కదులుతున్నట్లు భ్రమ పడ్డాను. తలెత్తేసరికి ఉషస్సు. పిట్టల కోలాహలం, పువ్వులు రాత్రి హోలీపండుగ చేసుకుని, మంచులో జలకాలాడి, చలికాచుకోడానికి వేడికోసం తహతహలాడుతున్నట్లు తలెత్తి చూస్తున్నాయ్.

ఆకాశం కడుపు పండి అరుణోదయమైంది. నా చీకటి హృదయంలోనికి వెలుగు చొచ్చుకుంది. హోటలు వదలి ఊరంతా తిరిగాను. నా కంటికి నా పట్నంలో కనపడే కలిమి దగ్గర లేమి చేసే వికటాట్టహాసం వినపడలేదు. విలయతాండవం కనిపించలేదు. ఇక్కడ మర్యాద యియ్యకుండానే మర్యాద పుచ్చుకోవటం, మనిషి రూపులో వున్నందుకే తోటి మనిషిని గౌరవిస్తున్నారు. డబ్బు, హోదా బ్రతకటానికి విధిగా వుండనవసరంలేదు. గుల్బం ఎంత ప్రయోజనమో గుల్బపుడెక్కకున్న మేకుకీ

అంతకు తగ్గ ప్రయోజనాన్ని ప్రజ గుర్తిస్తున్నారు. ఈ సంఘమనే సైకిలు నడపడానికి తిరిగే గొలుసులో ప్రతి ఒక్కడూ ఒక లింకుగా భావించి కదలుతున్నారు. ఈ చక్రాల్లో ప్రతి పౌరుడూ ఒక స్పోకు పుల్లనని గర్విస్తున్నాడు. దిగువనున్న కాలి బొటన వ్రేలికి దెబ్బ తగిలితే యెత్తునవున్న చేతులు వెళ్ళి అదుకున్నట్లు యిక్కడ మనుషులు మసలుతున్నారు. ఇక్కడా ఆర్థిక అసమానత్వం లేదనికాదు. అంతస్థుల భేదం లేదనికాదు. పై అంతస్థులోనున్నవారు దిగువ అంతస్థులో నున్నవాడిపై రాళ్ళు రువ్వలేదు. నిచ్చెన వేసి పైకి ఆహ్వానిస్తున్నారు. నిజం పలకటం, నిజాయితీగా మసలటం ఒక గొప్ప విషయంగా యిక్కడ తీసుకోవటం లేదు. ఎవరైనా అబద్ధం ఆడినా, అవినీతిగా ప్రవర్తించినా, మిగతావాళ్ళు ఆశ్చర్యపడి, మనం బలహీనుడని. మన అంగంలో ఒకదానికి జబ్బేదో వచ్చిందని, ఆ జబ్బుమనిషి కోలుకోడానికి తగ్గ సహాయం చేస్తూ, జాలీ, శ్రద్ధ కనపరచి, మళ్ళీ ఈ పటాలంలో సరిగా అడుగులు వెయ్యగలిగే వీరునిలా తయారుచేస్తున్నారు.

ఈ ఒక్క పట్నమే ఇలాయేమోనని, నా వంటి కలిమిగల టూరిస్టుకు చూపించడానికే ఈ యెడారిలో ఒయాసిస్సులా, స్వర్గంలో అలకాపురంలా సృష్టించారేమోనన్న అనుమానం కలిగింది. ఒక బికారిగా తయారయ్యాను. ఆ పట్నం విడిచి పల్లెప్రాంతాం నడుచుకుంటూ బయలుదేరాను. నడుస్తూనే మేఘాల్లో చినుకులు రాలి వూరువేపు వెలిగిన ఇంద్రధనుస్సులో అమృతహస్తం కనిపిస్తుందేమోనని చూశాను. త్రోవలో కలిసిన నలుగురిని అమృతహస్తం గురించి అడిగితే వాళ్ళు నవ్వుతూ "అలాంటిదెక్కడుంటుంది?" అన్నారు.

చీకటిపడ్డా చిమ్ముకుంటున్న కారు మేఘాలవేపు ఆశతో చూస్తున్నాను. మెరిసే మెరుపుల్లో చెయ్యి ఆకారం కనిపిస్తుందేమోనని చూశాను. కదిలే మేఘాలమధ్య వెలిగే చుక్కల్లోనైనా అమృతహస్తం జాడ తెలుస్తుందేమోనని ఎదురుచూశాను. అలా చూస్తుండగా వర్షం ముంచుకొచ్చింది. రోడ్డువార పాక పాకచూరు కింద తడిసిన నేను వణుకుతూ నిల్చున్నాను. వర్షం వెలిపిరి కొట్టోంది. ఆకాశం మెరుపులతో వెలిగి వురుములతో బ్రద్దలవుతోంది. దగ్గుతున్నాను.

చప్పున ఆ పాక తలుపులు తెరువబడ్డాయి. ఒక గొంతుక "లోపలికిరా నాయనా!" అని ఆహ్వానించింది. ఒక స్త్రీ మంచం మోసుకొచ్చింది. ఇంకొకావిడ కుంపటితో అగ్గితెచ్చింది. నన్ను లోనికిపిల్చిన మనిషి ఒక తువ్వాలు, పంచె, ఒక జత బట్టలు తెచ్చియిచ్చి, బట్టలు మార్చుకోమన్నాడు.

నేను బట్టలుమార్చి చలికాచుకునేవరకూ నన్నెవరని అడుగలేదు. నాకు తిండి పెట్టిన తర్వాతనైనా నే నెవర్నో అడుగలేదు. బహుశః వాళ్ళవాడి నెవరినోనని పొరపాటుపడ్డారెమోనని –

"నేను... నేను..." మాటలు నమిలాను.

"అవును. మీరు మా అతిథి. మా యింట్లోవాళ్ళకన్నా మీకు స్వతంత్రం అధికం వుంటుంది" అన్నాడు యింటి యజమాని.

పైన వర్షం ఉద్రేకం ఇంకా తగ్గలేదు. లోన లాంతరు వెలుగులో అంతా నా దగ్గరకు చేరారు. నా సేవకుని కన్నా వినయంగా, దేవుని మీద చూపించే భక్తికన్నా

మిన్నగానున్న వీళ్ళ అపురూపమైన మానవత నన్ను ముగ్ధుణ్ణి చేసి నా గురించి నేనే చెప్పకున్నాను. అంతా సావధానంగా విన్నాక ఆ యింటి యజమాని తన పొడుగాటి నుదిటిపై, యింటి కప్పనుంచి రాలిన వర్షపు బొట్లు తుడుచుకుంటూ చిన్న నవ్వు నవ్వాడు.

"మీకు అమృతహస్తం చూడాలన్న భ్రమ యింకా పోలేదా?"

"లేదు." అన్నాను ఆతృతతో.

వయస్సు అతని నడ్డి వంచినా, అతని హృదయం విశాలమైందిగానీ, కుదింపబడ నట్లుంది. ఆ మాంసం, కండలు కొంత కరిగాయ్ గానీ, ఆ దరహాసం చిమ్మే వెలుగు జ్ఞానంతో మిళితమై మానవుల కళ్ళకు అతీతమైన వెలుగుగా విరజిమ్ముతోంది. అతను చప్పన దీపానికి యెదరగా తన కుడిచెయ్యి నెత్తాడు. ఆ వెలుగులో అతని చెయ్యి ముడతలుపడ్డ చర్మంతో కాస్త వణుకుతూ కనిపించింది.

"ఇదిగో ఈ హస్తం. ఈ వ్రేళ్ళు చూడండి. ఒకదానికొకటి పోలికలేవు. అసమానతలున్నాయ్. కానీ ఈ శరీరాన్ని పోషించడానికి అవసరమైన ఆహారం తిన్నప్పుడు అన్నీ కలిసికట్టుగా నోటిలోనికి ముద్దనందిస్తాయి. ఆ ముద్ద తెచ్చుకోడానికి ఈ చెయ్యి పని చేసేటప్పుడు అన్ని వ్రేళ్ళు సహాయపడతాయ్ కదా! అలానే ఈ సంఘమనే శరీరాన్ని పోషించడానికి వివిధ ఆకారాలూ, వృత్తులూ, చిత్రాలలో వుండే ఈ మనుషులనే వ్రేళ్ళు ఒక్కటి కావాలి కదా! అప్పుడే కదా సంఘం తిండితిన్న మనిషిలా పెరుగుతుంది. శరీరం పెరిగితే కదా వ్రేళ్ళు ఆరోగ్యంగా వుంటాయి. అలాగే సంఘం వృద్ధి అయితే వ్యక్తులు కూడా వృద్ధి అవుతారు. - ఇదిగో ఇదే నాయనా... ఈ హస్తం మానవ హస్తం - ఇదే అమృతహస్తం!"

వాళ్ళందరూ నిద్దరపోయాక నా చెయ్యి వేపు చూసుకున్నాను. ఈ చేతిని నా కాము లోభాలతో నా అంగంగా యిన్నాళ్ళూ నిలిపి భస్మాసుర హస్తం చేసుకున్నాను. ఈ క్షణం నుంచి నా చెయ్యి అమృతహస్తం కావాలి... నా చేతిని వరసగా ముద్దు పెట్టుకుంటూ ఆ దేశంలో ఆ రాత్రి కడపటి రాత్రిగా గడిపి వచ్చాను.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 9-2-1968)

* * *